యోగాతో మధుమేహానికి చెక్



మల్కాజిగిరి: మధుమేహ వ్యాధి నివారణకు యోగా ఉపయోగపడుతుందని భారతీయ యోగా సంస్థాన్ హైదరాబాద్ పశ్చిమ జిల్లా అధ్యక్షుడు చింతా హరినాథ్‌రెడ్డి అన్నారు. మౌలాలి జెడ్పీటీసీ ట్రెనింగ్ సెంటర్‌లో మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆధునిక జీవన విధానంలో ఆహారం, అలవాట్లు వ్యాధులకు గురిచేస్తున్నాయని, ముఖ్యంగా రక్తపోటు, మధుమేహ వ్యాధికి ఎక్కువ మంది గురవుతున్నారన్నారు. ఆహార అలవాట్లు మార్చుకొని యోగా, ధ్యానంతో వాటిని నియంత్రించడమే కాకుండా, నిర్మూలించడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. యోగా శిక్షకురాలు కిరణ్ పటేల్ పలు సూచలను శిబిరంలో తెలియజేశారు. శిక్షణ తరగతుల్లో ట్రెనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ శర్మతో పాటు సుమారు 59 మంది పాల్గొన్నారు.

నూతనంగా బాక్స్ డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేయాలి

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని ఈస్ట్ అన్నపూర్ణ కాలనీ ప్రధాన రోడ్డు నుంచి జనప్రియ, భవానీనగర్ పెద్ద బాక్స్ డ్రైనేజీ వరకు నూతనంగా బాక్స్ డ్రైనేజీ లైన్‌ను ఏర్పాటు చేస్తే మురుగు, వరద నీరు సాఫీగా సాగుతుందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డికి అన్నపూర్ణ కాలనీ సలహాదారులు శ్రీకాంత్‌రెడ్డి వివరించారు. గురువారం పరమేశ్వర్‌రెడ్డికి బాక్స్ డ్రైనేజీ లైన్ కోసం శ్రీకాంత్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులకు వినతి పత్రం అందజేశామని గుర్తు చేశారు. వరద, మురుగు నీరు సాఫీగా వెళ్లకపోవడంతో కాలనీలోని ఇళ్లలోకి నీరు చేరుతోందన్నారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరం అయ్యేలా చూడాలని శ్రీకాంత్ రెడ్డి కోరారు.

ఈ ఆసుపత్రులకు వసూళ్ల రోగం

- 2 నెలల్లో 5 ప్రైవేట్ ఆసుపత్రులు, 2 డయాగ్నోస్టిక్ సెంటర్లు, 2 అల్ట్రా మిషన్లు, ఒక ల్యాబ్ సీజ్, మరో క్లినిక్‌కు షోకాజ్
- ఫిర్యాదులు వస్తేనే తనిఖీలు చేస్తున్న వైద్యఆరోగ్యశాఖ
- ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీ.. పట్టించుకోక రోగులకు తిప్పలు

కొరడా ఝుళిపిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అనుమతిలేకుండా పుట్టగొడుగుల్లా వెలుస్తూ అడ్డగోలుగా ఫీజులు వసూళ్లకు తెగబడుతున్న ప్రైవేట్ ఆసుపత్రుల రోగం కుదిర్చేపనిలో వైద్య, ఆరోగ్య శాఖ పడింది. వాటికి గట్టి షాక్ ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఒక ఆసుపత్రికి అనుమతి తీసుకొని రెండు, మూడేసి బ్రాంచీలు తెరుస్తున్నాయని గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేస్తోంది. మరోవైపు కొన్నింటికి ఎలాంటి పరిశీలన, విచారణ లేకుండానే వైద్యారోగ్య శాఖ అనుమతులు ఇస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. అవసరం లేకున్నా రకరకాల వైద్య పరీక్షలు చేస్తూ పేద రోగుల రక్తం పీల్చుతున్నాయని, అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నాయని పలు ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, అల్ట్రా సౌండ్ సెంటర్లపై వైద్య శాఖకు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను పట్టించుకోకుండా.. ఉల్లంఘించిన ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లపై చర్యలకు జిల్లా వైద్యారోగ్యశాఖ సిద్ధమవుతోంది.

ఫిర్యాదులతోనే తనిఖీలు.. చర్యలు

తెలంగాణ రాష్ట్ర ప్రాంతీయ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆదేశాల మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మార్చి 27న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వైద్య బృందం ఉప్పల్‌లోని శ్రీ మణికంఠ హెల్త్ కేర్ అండ్ పాలీ క్లినిక్, చిలుకానగర్‌లోని శ్రీ రాజు ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ నిర్వహించిన వైద్య బృందం అర్హత కలిగిన వైద్యులు, సిబ్బంది లేరని గుర్తించి, వాటిని సీజ్ చేశారు. సరైన దస్తావేజులు లేని చిలుకానగర్ మెసర్స్ మహాలక్ష్మి క్లినిక్‌కు నోటీసు జారీ చేశారు.

◆ ఏప్రిల్ 3న షాపూర్‌నగర్‌లో ఆర్ఆర్ శ్రీజన్ క్లీనిక్, శ్రీ వీరభద్ర ఫస్ట్ ఎయిడ్ క్లీనిక్, అన్నపూర్ణ ల్యాబ్‌లను తనిఖీ చేసిన వైద్య బృందం అర్హతలేని వైద్యులు, సిబ్బందితో వాటిని నడుపుతున్నారని గుర్తించి సీజ్ చేశారు. గత సంవత్సరంలో ఇదే సీజన్‌లో పీర్జాదిగూడలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఒక ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేసిన వైద్యబృందం స్థానికంగా ఉన్న పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహించి మరో 4 ప్రైవేట్ ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మే 14న ఉప్పల్‌లో వాసవి డయాగ్నోస్టిక్ సెంటర్ తోసహా శోభసాయి డయాగ్నోస్టిక్ సెంటర్‌లోని అల్ట్రా సౌండ్ యంత్రాన్ని సీజ్ చేశారు. మే 25న ఉప్పల్‌లోని ధనుంజయ్ డయాగ్నోస్టిక్ సెంటర్‌సహా అల్ట్రా సౌండ్ మిషన్‌ను సీజ్ చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు, ఫిజియోథెరపీ, డయాగ్నోస్టిక్ సెంటర్లు, రిహాబిలిటేషన్ సెంటర్లపై కొరడా ఝుళిపించేందుకు వైద్యారోగ్యశాఖ సన్నద్ధమవుతోంది. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్, అనుమతులు తదితర అంశాలపై వైద్యారోగ్యశాఖ ఆరా తీస్తోంది.



నిబంధనలు ఇలా..

అల్లోపతి ప్రైవేటు మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, కన్సల్టెంట్ క్లినిక్‌లు, ఆయుష్ క్లీనిక్‌లు, ఫిజియోథెరపీ కేంద్రాలు అన్నింటికీ అనుమతి తప్పనిసరి. నిబంధనల ప్రకారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో దరఖాస్తు చేసుకోవాలి. అలా దరఖాస్తు చేసుకున్న ఆసుపత్రి, క్లినిక్, డయాగ్నోస్టిక్ కేంద్రాల నిర్వాహకులు అందులో పనిచేసే వైద్యుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలి. అగ్నిమాపక, బయో వేస్ట్‌మేనేజ్మెంట్, పొల్యూషన్, మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్‌సహా అన్నిరకాల పత్రాలు సరిగా ఉన్నప్పుడే ఆసుపత్రుల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాల్సి ఉంటోంది.

ఇష్టారాజ్యంగా ..

జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఇష్టారాజ్యంగా ఫీజుల వసూళ్లు మొదలుకొని వైద్యపరీక్షలు తదితర వాటిల్లో కొనసాగుతున్న దోపిడీని పసిగట్టిన జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ బోర్డుల మీద ఫీజుల ధరల వివరాల పట్టికసహా డాక్టర్లు, సిబ్బంది, పడకల సంఖ్య వంటి సమాచారాన్ని పొందుపర్చాలని ఆదేశాలు జారీ చేసింది.

అనుమతిలేని ఆసుపత్రులు 895..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2,500పైగా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు ఉండగా, ఇందులో రిజిస్ట్రేషన్‌సహా వివిధ అనుమతితో కొనసాగుతున్న ఆసుపత్రులు 1,605 ఉన్నాయి. ఎలాంటి అనుమతి లేని ప్రైవేట్ ఆసుపత్రులు 895 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ అంచనా వేస్తోంది. అనుమతులు ఉన్న ఆసుపత్రుల్లో వంద కంటే ఎక్కువ పడకలు ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు 48 ఉండగా, 20 నుంచి 100 పడకలు(బెడ్స్) ఉన్న ఆస్పత్రులు 317 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ పేర్కొంటోంది. 20 పడకలు(బెడ్స్) ఉన్న ఆస్పత్రులు 294 ఉన్నాయి. 712 పాలీక్లినిక్‌లు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, 180 డెంటల్ ఆస్పత్రులు, 46 ఫిజియోథెరపీ సెంటర్లు, 08 రిహాబిలిటేషన్ సెంటర్లు, 628 అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. ఎలాంటి అనుమతి లేని స్కానింగ్ సెంటర్లు 400 వరకు ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ అంచనా వేస్తోంది.

నేటి నుంచి శ్రీ విష్ణు శివాలయ దేవస్థానం బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబయిన ఆలయం

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రిలో అక్కన్న మాదన్న హయాంలో నిర్మించిన అతిపురాతన శ్రీ విష్ణు శివాలయ దేవస్థానం 38వ కల్యాణ మహోత్సవ బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు దేవస్థాన ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. 31న (నేడు) సుప్రభాత సేవతో గోపూజ, విష్వేశ్వరపూజ, ధ్వజారోహణం, మంటపారాధన, నాదస్వనగోష్ఠి, స్వామి వార్లకు అభిషేకం అలంకరణం, హారతి, తీర్థప్రసాద వితరన ఉంటుందన్నారు. 1న తీర్థశ్రీ వీరాంజనేయ స్వామి వారికి సింధూర అభిషేకం, అనంతరం కల్యాణోత్సవములు, అన్నదానం ఉంటుందని వివరించారు.

ఆర్టీసీ డిపోలో 'హెల్త్ చాలెంజ్' ప్రారంభం



హెల్త్ చాలెంజ్‌ను ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ సుధాకర్

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ ఆర్టీసీ డిపోలో గురువారం గ్రాండ్ హెల్త్ చాలెంజ్–2 కార్యక్రమాన్ని డిపో మేనేజర్ సుధాకర్ ప్రారంభించారు. తెలంగాణ ఆర్టీసీ సజ్జనార్ ఆదేశాల మేరకు డిపోలో ప్రతీ ఉద్యోగికి వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం గురువారం నుంచి జూన్ 5 తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రతీ ఉద్యోగి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రామారావు, వైద్య సిబ్బంది, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

గాయపడిన మున్సిపల్ ఉద్యోగులను ఆదుకోవాలి



డీఈ మాధవాచారికి వినతిపత్రం అందచేస్తున్న సీపీఐ నాయకులు

జవహర్‌నగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మున్సిపల్ ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలని, వారి కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.బాలమల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ కార్యాలయంలో డీఈ మాధవాచారికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా బాలమల్లేష్ యాదవ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా డబ్బులను బ్యాంకులో జమ చేసేందుకు వెళ్లి తిరిగి స్కూటీపై వస్తుండగా టిప్పర్ ఢీ కొట్టడంతో రవి అనే ఉద్యోగి చెయ్యి పూర్తిగా కోల్పోయాడని, నరేష్‌కు తీవ్ర గాయాలయ్యాయన్నారు. వీరి కుటుంబాలు రెక్కాడితే గానీ డొక్కాడని దిక్కుతోచని స్థితిలో ఉన్నాయని, ప్రభుత్వం, మున్సిపల్ కార్పొరేషన్ చొరవ తీసుకొని వారికి న్యాయం జరిగేలా చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహా, దశరథ్, జంగయ్య, కృష్ణమూర్తి, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా కొండాపూర్ సబ్‌స్టేషన్ అవుషాపూర్ ఫీడర్ 11 కేవీ పరిధిలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అవుషాపూర్, జగత్స్వప్న వెంచర్, కేపాల్, అనురాగ్ కళాశాల, వినూత్న హైట్స్, అరోరా కళాశాల, శ్రీనిధి రిసార్ట్స్, గోల్డన్ వ్యాలీ, అంకుషాపూర్ 33/11 కేవీ అంకుషాపూరు 11కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చందుపట్లగూడ, ఎదులాబాద్, కొత్తగూడలో విద్యుత్ సరఫరాకు అంతరా యం ఉంటుదని ఘట్‌కేసర్ ఏఈ సతీశ్‌కుమార్ తెలిపారు.

మేడ్చల్: రాజబొల్లారం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాజబొల్లారం తండా గ్రామంతోపాటు రాజబొల్లారం గ్రామ పరిధిలోని పలు కంపెనీలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోచారం: నారపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టినందున శుక్రవారం కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొర్రెముల గ్రామ పంచాయతీ పరిధిలోని కాలనీలు, చౌదరిగూడ గ్రామం, వెంకటాపూర్, మక్త, తేనుగూడెం, బాలాజీ నగర్, సుప్రభాత్ టౌన్‌షిప్ ప్రాంతాలకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్నానగర్, డాక్టర్స్ కాలనీ, జోడిమెట్ల క్రాస్‌రోడ్, అరుంధతి కాలనీ, హుడా కార్తికేయ, కాకతీయనగర్, స్వర్ణగిరి కాలనీ, వైష్ణవి నగర్, చౌదరిగూడ, వెంకటసాయినగర్, పద్మావతి కాలనీ, శేషాద్రి ఎన్‌క్లేవ్, సీతమ్మ కాలనీ, జోడిమెట్ల, మేధ కంపెనీ ఎదుట, పోచారం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

శామీర్‌పేట: అలియాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం కరెంటు సరఫరాకు అంతరాయం కలగనుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని మరమ్మతుల కారణంగా జగ్గంగూడ, సంపన్‌బోల్ గ్రామ పరిధిలోని నిక్‌మార్ కళాశాల, అల్ఫామెడ్ కంపెనీ, హెరిటేజ్, కీర్తి పౌల్ట్రీ, సాంజెంటా కంపెనీ తదితర ప్రంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందన్నారు.

జవహర్‌నగర్: విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ ఎర్రన్న తెలిపారు. లక్ష్మీనర్సింహస్వామి ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు చెన్నాపురం, మదర్‌థెరిస్సా కాలనీ, సిటిజన్స్ కాలనీ, శాంతినగర్, మూడుగుళ్లు, చిలుకల బిల్డింగ్, రేణుకా ఎల్లమ్మ టెంపుల్, ఆదర్శనగర్, వికలాంగుల కాలనీ, అదేవిధంగా చెన్నాపురం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీఆర్‌పీఎఫ్, మల్లెలగూడ, అరుంధతినగర్, ఫారూక్‌బస్తీ, ఫారానగర్, మల్కారం, డంపింగ్‌యార్డు, పుల్లయ్యనగర్, గోశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మంచినీటి వసతి కల్పించాలని వినతి



ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ

ఘట్‌కేసర్: కాచవానిసింగారం, దివ్యనగర్, సుప్రభాత్ ఫేస్ 1, 2, 3 కాలనీలకు హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ ద్వారా మంచి నీటి వసతి కల్పించాలని నగరంలోని హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ ఖైరతాబాద్ కార్యలయంలో మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డికి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి గురువారం వినతి అందజేశారు. ఓఆర్ఆర్ లోపలి గ్రామాల్లో వందలాది కుటుంబాలు నీటి వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి మంచినీటి వసతి కల్పించాలని లేఖలో కోరారు.

శ్మశానవాటిక స్నానాల గది కబ్జాకు యత్నం



నోటీస్‌ను అంటిస్తున్న సిబ్బంది

శామీర్‌పేట్: శామీర్‌పేట శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన స్నానాల గదిని పశువుల పాకగా మార్చారని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు శామీర్‌పేట గ్రామ పంచాయతీ కార్యదర్శి మౌనిక దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రజా అవసరాల కొరకు ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన స్నానాల గదిని కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నిస్తునారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి ఆ ప్రాంతాన్ని సందర్శించి, హెచ్చరిక బోర్డు, నోటీస్ ఏర్పాటు చేశారు.

పార్క్ చేసిన లారీ చోరీ

పోచారం: పార్క్ చేసిన లారీ చోరీకి గురైన సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 20వ తేదీన చౌదరిగూడలోని రైస్ మిల్ ఎదురుగా ఉన్న ఖాళీ జాగాలో లారీని శ్రీశైలం పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు వచ్చి చూస్తే లారీ కనిపించలేదు. ఎంత వెతికినా దొరకకపోవడంతో గురువారం పోచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దార్యప్తు చేస్తున్నారు.

సక్రమ విధులతో క్షయ నిర్మూలన

వైద్యుల సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్



సాక్షి,మేడ్చల్ జిల్లా: డాక్టర్లు,వైద్య సిబ్బంది విధులను శ్రద్ధగా నిర్వహించటం ద్వారా క్షయవ్యాధిని సంపూర్ణంగా నిర్మూలించాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం హాలులో ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖకు సంబంధించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యాలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేయాలని అభిషేక్ కోరారు.

◆ క్షయవ్యాధి నిర్మూలన కోసం వయోజనులకు బీసీజీ టీకా వేసేందుకు వైద్యారోగ్య శాఖ చేపడుతున్న మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. క్షయ వ్యాధి బాధిత కుటుంబాలను గుర్తించేందుకు ఇంటింటి సర్వేను పలు జాగ్రత్తలతో నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వైద్యులతో ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు, పేదలకు అందుతున్న వైద్యసేవలపై ఆయన మాట్లాడటంతోపాటు వారితో కొద్దిసేపు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి, డెమో అంజయ్య , పలువురు డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. సమావేశానికి ముందు జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రఘునాథస్వామితో కలిసి వైద్యుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

3 నుంచి 19 వరకు బడిబాట

- తల్లిదండ్రులు ,టీచర్లు, ప్రజలను భాగస్వామ్యం చేయాలి
- జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి



సాక్షి, మేడ్చల్ జిల్లా: వచ్చే నెల 3 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి కోరారు. మండల విద్యాశాఖ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో బడిబాట కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల 3న గ్రామ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి, ప్రతిజ్ఞ చేయించాలన్నారు. 4న ప్రతి ఇంటిని సందర్శించి బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు గ్రామస్థాయి రిజిస్టర్‌లో పేరు నమోదు చేయించాలన్నారు. 5 నుంచి 10 తేదీ వరకు బస్తీ , పల్లెల్లో గడప గడప ప్రచారం చేయటంతోపాటు అంగన్వాడీ సెంటర్లలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు బడిబాటపై కరపత్రాలు, బ్యానర్లు, పాఠశాలల్లో ఏర్పాటు చేయటంతోపాటు బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని సూచించారు. 11న గ్రామ సభలు నిర్వహించి, బడిబాట కార్యక్రమాన్ని సమీక్షా సమావేశాలను నిర్వహించాలన్నారు. 12న పాఠశాల సుందరీకరణ తోపాటు పండుగ వాతావరణం నెలకొల్పి, తల్లిదండ్రులతో మీటింగ్ ఏర్పాటు చేసి, అమ్మ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేయబడిన పనులను ప్రారంభించాలన్నారు. పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేయాలని వివరించారు. 13న విద్యార్థులతో పుస్తకపఠనం కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. 14న పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం, బాల సభలు ఏర్పాటు చేయాలని సూచించారు. 15న అంగవైకల్యం కలిగిన విద్యార్థులను భవిత సెంటర్లలో చేర్పించాలని చెప్పారు. అలాగే, బడిబాటలో నమోదు చేయబడిన బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలని, 18న విద్యార్థులకు డిజిటలైజేషన్‌పై అవగాహన కల్పించాలన్నారు. మొక్కలు నాటించటం, వాటిని సంరక్షించటంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఇంగ్లిష్ మీడియం బోధనపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. 19న విద్యార్థులకు పలు క్రీడలను నిర్వహించటంతోపాటు వారందర్ని క్రీడల్లో భాగస్వామ్యం చేయాలన్నారు.

మున్సిపాలిటీలో గ్రామాల విలీనం వద్దు: బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కీసర: కీసర మండల పరిధిలో ఓఆర్ఆర్ లోపలి గ్రామాలను సమీప మున్సిపాలిటీలో విలీనం చేసే ఆలోచనను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని బీజేపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ చీర్యాల, గోధుమకుంట, కరీంగూడ, తిమ్మాయిపల్లి, నర్సంపల్లి గ్రామాలను సమీప మున్సిపాలిటీలో విలీనం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కసరత్తును విరమించాలని కోరారు. లేదంటే పెద్దయెత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ బోడ శ్రీనివాసరావు, కీసర మండల అధ్యక్షుడు దేశం మల్లేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు కోల బాలరాజ్ యాదవ్, వంగేటి బాపిరెడ్డి, ఓబీసీ జిల్లా కార్యదర్శి దొబ్బల శ్రీశైలం, జిల్లా కార్యవర్గక సభ్యుడు ఐలయ్య పాల్గొన్నారు.

కొర్రెముల్‌లో యథేచ్ఛగా అక్రమకట్టడాలు

పట్టించుకోని పంచాయతీ అధికారులు



ప్రత్యూష కాలనీలో నిర్మించిన మూడు అంతస్తుల భవనం

ఘట్‌కేసర్: కొర్రెముల్ గ్రామపంచాయతీ పరిధిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. ఉన్నతాధికారులు ఎన్నికల బిజీలో ఉండగా అదను చూసి అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. అక్రమ కట్టడాలను నిలుపుదల చేయడంలో పంచాయతీ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్యూష కాలనీ, వైభవ్ కాలనీ, బాలాజీనగర్‌లో పలువురు రెండస్తులకు అనుమతి తీసుకొని మూడు, నాలుగు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన సిబ్బందిని బెదిరిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన పెద్ద నాయకులు తమకు తెలుసని, వారితో మాట్లాడతావా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంచాయతీ కార్యాలయం సిబ్బంది మిన్నకుండిపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కట్టడాలను నిలుపుదల చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీఓ రవిని వివరణ కోరగా అక్రమ నిర్మాణాలపై సమాచారం లేదన్నారు. ప్రస్తుతం ఎన్నికల విధుల్లో ఉన్నానని, అవి పూర్తి కాగానే అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన



కోనాయిపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ సుమిత



రాజబొల్లారంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ తేజస్విని

మేడ్చల్‌రూరల్: విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. మండలంలోని డబిల్‌పూర్, కోనాయిపల్లి, రాజబొల్లారం, లింగాపూర్, రాజబొల్లారం తండాలో మండల విస్తరణాధికారులు సుమిత, తేజస్విని రైతు అవగాహన సమావేశాలు ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖ గుర్తింపు ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలు, డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని, ఆ సమయంలో రసీదు తప్పనిసరిగా తీసుకుని పంట కాలం పూర్తయ్యేవరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

400 కిలోల పటిక, 200 కిలోల బెల్లం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రి

పోచారం: సారా తయారీకి వినియోగించే పటిక, బెల్లంను అక్రమగ సరఫరా చేస్తున్న వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు నారపల్లిలోని నందనవనం వద్ద జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులతోపాటు ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. సారా తయారీకి వినియోగించే ముడి సరుకు తీసుకెళ్తున్న లారీని తనిఖీ చేసి అదుపులోకి తీసుకొన్నారు. నిందితులు అన్నోజిగూడకు చెందిన మాలోత్ శ్రీనివాస్ (38), నాంపల్లికి చెందిన సయ్యద్ సాదిఖ్ (56), బేగంబజార్‌కు చెందిన కర్వ ఘనశ్యాందాస్ (56)లను రిమాండ్ చేశారు. మరో నిందితుడు మల్యాల సుమంత్ పరారయ్యాడు. 400 కిలోల పటిక, 200 కిలోల బెల్లం, లారీ, 24 బ్యాగుల పొగాకు, 10 కార్టన్ల జేకే పొగాకు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సరకు విలువ సుమారు రూ. 8 లక్షలు ఉంటుంది. తనిఖీల్లో జిల్లా ఆబ్కారీ టాస్క్‌ఫోర్స్ అధికారి కె.భరత్ భూషణ్, ఘట్‌కేసర్ సీఐ జె.రవి, ఎస్ఐలు శ్రీనివాస్‌రెడ్డి, నందిని, సంగీత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పేదలు సీఎంఆర్ఎఫ్‌ను వినియోగించుకోవాలి

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని బాలాజీనగర్‌కు చెందిన మల్లేష్ యాదవ్‌కు మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.1,50,000 మంజూరయ్యాయి. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గురువారం మంజూరు పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు, మధ్య తరగతి ప్రజలు తమ చికిత్సలకు అయ్యే ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఉపయోగించుకొని లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత గంధం నాగేశ్వరరావు, పవన్, చాంద్ పాషా, షోరూమ్ శంకర్, పాపిరెడ్డి, ఆనంద్, టోని తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమత్ జయంతి ఉత్సవాలు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ కనకరాజుతోట(శంకర విద్యా పీఠం) లో శుక్రవారం నుంచి హన్‌మత్ జయంతి ఉత్సవాలు జరుగుతాయని హన్‌మత్ పీఠం వ్యవస్థాపకులు ఘంటసాల సత్యసాయి తెలిపారు. శుక్రవారం కలశస్థాపన, గణపతి హోమం, మన్యు సూక్త హోమం, సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం, శనివారం హనుమత్ జయంతి సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి హనుమాన్ చాలీసా పారాయణం, సాయంత్రం 6 గంటలకు 27 నక్షత్ర జప, శాంతిహోమం, చివరి రోజు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి కోటి రామనామ జప పూర్ణాహుతి హోమం, సాయంత్రం సీతారామ కల్యాణంతో కార్యక్రమం ముగుస్తుందని ఆయన తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387